క్లుప్తంగా

ఉగ్రదాడి పాశవిక చర్య

మాజీ ఎంపీ. బీబీపాటిల్



జహీరాబాద్‌లో బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ

జహీరాబాద్ టౌన్: జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం పాశవిక చర్య అని మాజీ ఎంపీ బీబీపాటిల్ మండిపడ్డారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ సందర్శనకు వెళ్లిన 26 మందిని ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపడం అమానవీయమని అన్నారు. మృత్యుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



మాట్లాడుతున్న రీసెర్చ్ స్కాలర్ ప్రకాశ్

జహీరాబాద్ టౌన్: ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బెంగళూర్ ఎంఎస్ రామయ్య కళాశాల రీసెర్చ్ స్కాలర్ ప్రకాష్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రామిక్ భవనంలో బుధవారం కెరీర్ గైడెన్స్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రకాష్ మాట్లాడుతూ 10వ తరగతి నుంచే భవిష్యత్ మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రస్తుత చదవు అనంతరం ఏం చేయాలి.. ఏం చదవాలనే అనే అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, నాయకులు విష్ణు, హరీశ్, రాఘవేంద్రలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్ప అధికారులను కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేస్తే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మిగిలిన పనులకు త్వరలో నిధులు మంజూరయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, బాలయ్య, ముత్తన్న, వీరయ్య, నాగరాజులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

పటాన్‌చెరు టౌన్: మండలంలోని బచ్చుగూడెంలో బుధవారం మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిస్టులో ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, వితంతువులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

ఎరువుల కొరత సృష్టించవద్దు

ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల విక్రయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం సిర్గాపూర్‌లో ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. నాణ్యమైన, సర్టిఫైడ్ విత్తనాలు విక్రయించాలని సూచించారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ హరికృష్ణ పాల్గొన్నారు.

తాగునీటికి తండా వాసుల తంటా

- ఇంటింటికీ నల్లాలు లేక అవస్థలు
- నిత్యం తప్పని సర్కస్ ఫీట్లు
- సాధుతండా గిరిజనుల దుస్థితి

కంగ్టి(నారాయణఖేడ్): ఓవర్ హెడ్ ట్యాంకుకు నీళ్లు ట్యాంకులోకి వెళ్లేందుకు ఒక పైపు, ఇళ్లకు సరఫరా చేసే పైపు, క్లీనింగ్ పైపు ఇలా మూడు పైపులు మాత్రమే ఉంటాయి. కానీ, కంగ్టి మండలం రాజారాంతండా గ్రామపంచాయతీకి హామ్లెట్ తండాగా ఉన్న సాధుతండాలో మాత్రం ట్యాంకుకు 40 పైపులు వేసిమరీ తాగునీటిని ఇంటింటికీ తెచ్చుకుంటున్నారు. ఈ వేసవిలో మరింత ఇది మరీ ఎక్కువైంది. సాధుతండాలో దాదాపు 35 ఇళ్లు, 8 నివాస షెడ్లు ఉన్నాయి. 228 మంది జనాభా ఉంది. కాగా మిషన్ భగీరథ పథకంలో నీటి సరఫరా సక్రమంగానే ఉన్నా...ఇంటింటి సరఫరాలో ఏర్పడిన లోపం మాత్రం సరిచేయడం లేదు. దీంతో తండావాసులు నిత్యం ట్యాంకు పైకి ఎక్కి పైప్ వేసుకోవడంతో సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ సత్తయ్య వివరణ కోరగా తండాలో పైప్‌లైన్ వేసే సమయంలో వారి సమన్వయం లేకపోవడంతో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. జరిగిన మేరకైనా సక్రమంగా నీటిని వాడకుండా..ఛద్రలు తీసివేసి ఇష్టారాజ్యంగా వాడుతున్నారని తెలిపారు. తాను తండాను సందర్శించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.



సాధుతండాలో ట్యాంక్‌కు అల్లుకున్న తాగునీటి సరఫరా పైపులు

26 వరకు టీకాల శిబిరాలు

- వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- దౌల్తాబాద్‌లో అనుమతుల్లేని ఓ ప్రైవేటు ఆస్పత్రి సీజ్
- జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి



హత్నూర మండలం చింతల్చెరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులు పరిశీలిస్తున్న గాయత్రీదేవి

హత్నూర(సంగారెడ్డి): ఈ నెల 26 వరకు నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి పేర్కొన్నారు. హత్నూర మండలం చింతల్చెరు దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం గాయత్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జీరో నుంచి 16 ఏళ్ల బాలబాలికలు గర్భిణీలు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. జిల్లాలో 3,328 మంది వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేసుకోలేదని వీరందరి కోసం ప్రత్యేకంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టీకాల క్యాంపులను ఏర్పాటు చేశామని తెలిపారు. క్రమం తప్పకుండా గర్భిణీలు బాలబాలికలు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రి సీజ్

హత్నూర మండలం దౌల్తాబాద్‌ని అనుమతిలేని దేవి ఆస్పత్రిని సీజ్ చేసినట్లు జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి తెలిపారు. ఆస్పత్రి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలుగానీ, కనీసం రికార్డులు గానీ లేవన్నారు. ఆస్పత్రిలో ఆరు పడకలు వేసి వైద్యం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇందుకోసం ఆస్పత్రి సీజ్ చేసినట్లు గాయత్రీదేవి తెలిపారు.

ఆటో డ్రైవర్ కూతురుకు రాష్ట్రస్థాయి ర్యాంకు

విద్యార్థినికి సన్మానించిన కాంగ్రెస్ నేత



నారాయణఖేడ్: బైజాసాబాతో పాటు ఆమె తండ్రిని సన్మానించిన శ్రీనివాస్

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.ఏ హకీం కూతురు బైజాసాబా ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 990 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించింది. బుధవారం పీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ సాబాతోపాటు ఆమె తండ్రిని శాలువాతో సన్మానించి అభినందించారు. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సైతం బైజాసాబా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి సత్తాచాటింది. ద్వితీయ సంవత్సరంలోనూ ప్రతిభ కనబర్చి ఈ ప్రాంతానికి మంచిపేరు తెచ్చిందని కొనియాడారు. మైనార్టీ నాయకులు అజీం, జుబేర్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో సెయింట్ ఆంథోని ప్రభంజనం



విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి

సంగారెడ్డి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్ ఫస్టియర్‌లో సీఈసీ విభాగంలో 500 మార్కులకుగాను 460కి పైగా మార్కులను నలుగురు విద్యార్థులు సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు జి.నందిని 989, బైపీసీలో జైనబ్ ఫాతిమా 991 మార్కులను సాధించారు. సీఈసీ 1000 మార్కులకు గాను ఆయు శ్రీచౌదరి 957 సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి అభినందించారు.

సీసీ రోడ్డు వేయించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

మునిపల్లి(అందోల్): మండల కేంద్రం మునిపల్లి కాలనీలో డబుల్ బెడ్రూం ఇళ్ల మధ్యన సీసీరోడ్డు వేయించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని సీపీఎం మండల నాయకుడు రమేశ్‌గౌడ్ కోరారు. బుధవారం మండల కేంద్రం మునిపల్లిలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో ప్రజలు, కాలనీవాసులు డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరినంధన్‌రావుతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారు

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



పార్టీ శ్రేణులతో చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం సమావేశమయ్యారు. ఈనెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. మళ్లీ కేసీఆర్ పాలన కావాలి అని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మామిళ్ల రాజేందర్, హకీమ్, వేణుగోపాలస్వామి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ అరెస్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మదర్సాపై దాడికి నిరసనగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేక్ అబ్దుల్ ఘనీ ఆధ్వర్యంలో పలువురు జిన్నారం బయలుదేరడానికి ప్రయత్నించగా.. వెళ్లకుండా బుధవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. 1,500, ఒకరికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రైతులకు అవగాహన కలిపించాలి

ఆర్డీఓ అశోక చక్రవర్తి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కలిపించాలని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం సిర్గాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులు, ప్రజలకు జవాబుదారిగా ఉండి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీమ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లి మండల టాపర్‌గా మేఘన



మునిపల్లి(అందోల్): ఇంటర్ ఫలితాల్లో అధిక మార్కులు సాధించి మేఘన మండల టాపర్‌గా నిలిచింది. బుధవారం ఇంటర్మీడియట్ ఫలితాల వివరాలను సంబంధిత అధికారులు తెలియజేశారు. సెకండియర్‌లో 133 మందికి 124 మంది పరీక్ష రాయగా, వారిలో 86 మంది, 69 శాతం మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మేఘనకు బైపీసీలో 950 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో హర్షిత 879 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. సీఈసీలో మహేశ్వరి 842 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. ఫస్టియర్‌లో ఎంపీసీ 376 మార్కులు, డి. రహమాన్ 419 బైపీసీ, డి. హర్షిత సీఈసీ 369 మార్కులు సాధించారు.

పీసీసీ పరిశీలకుల నియామకం

సంగారెడ్డి జోన్: జిల్లాల వారీగా కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ పరిశీలకులను నియామకం చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లా పరిశీలకులుగా రామ్మోహన్‌రెడ్డి, చరగని దయాకర్, మెదక్ జిల్లా పరిశీలకులుగా మెట్టు సాయికుమార్, ఊట్ల వరప్రసాద్, సిద్దిపేట జిల్లాకు పవన్ మల్లాడి, యం.రోహిత్‌రావు నియామకం అయ్యారు.

క్వారీల తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులు మాదారంలో పర్యటించారు. కంకర క్రషర్లు క్వారీల నిర్వహణ ప్రదేశాలను పరిశీలించారు. ప్రాజెక్టు రిపోర్టులను యాజమాన్యాలు జిల్లా మైనింగ్ ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం



సమావేశంలో చైర్మన్ చంద్రశేఖర్, చిత్రంలో ఈఓ శివరుద్రప్ప, పాలక మండలి సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి వచ్చేభక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కృషి చేస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్ తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో పాలకమండలి ఆలయ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ఆవరణలోని ధర్మ సత్రంపై అంతస్తు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రసాదాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివ రుద్రప్ప, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బోనమెత్తిన మహిళలు



తడ్కల్‌లో ఎల్లమ్మ తల్లికి బోనాలతో ఊరేగిస్తున్న మహిళలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్‌లో ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బోనాల ఊరేగింపు చేశారు. డప్పు వాయిద్యాలతో గ్రామ దేవతలకు దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. ఎల్లమ్మతల్లికి బోనాలతో మొక్కులు తీర్చుకొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎల్లమ్మ ఆలయం పరిసరాల్లో కుస్తీ పోటీలు, జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కుస్తీ పోటీల్లో సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పహిల్వాన్‌లు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఊరేగింపుగా మహిళలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లిలో గ్రామస్తులు బుధవారం గ్రామదేవతలకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోతుల వల్లే విగ్రహం ధ్వంసమైంది

- విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- సంయమనం పాటించండి
- మల్టీ జోన్ 2 ఐజీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ, చిత్రంలో ఎస్పీలు పరితోశ్ పంకజ్, నారాయణరెడ్డి

సంగారెడ్డి జోన్: జిన్నారం గ్రామ శివారులో ఉన్న ఓ విగ్రహం కోతులు దాడి చేయడం వల్లే ధ్వంసమైందని మల్టీ జోన్ 2 ఐజీపీ సత్యనారాయణ వెల్లడించారు. ఆ సమయంలో ఓ వర్గానికి చెందిన విద్యార్థులు ఆటలు ఆడుకుని వస్తుండగా స్థానికులు చూసి వారే విగ్రహాన్ని ధ్వంసం చేశారని భావించడంతోనే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొన్నట్లు వివరించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ...వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసి, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులకు సహకరించాలని ఇలాంటి సమయాల్లో ప్రజలంతా సంయమనం పాటించాలని సూచించారు. చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోకూడదని, ఇటువంటి ఘటనలు జరిగితే సమీప పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని తెలిపారు. కేసు దర్యాప్తులో త్వరితగతిన స్పందించిన సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల ఎస్పీలు పరితోశ్ పంకజ్, ఉదయ్ కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డిలను ఐజీ అభినందించారు.

విధ్వంసానికి పాల్పడటం హేయం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



అంజిరెడ్డి, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

పటాన్‌చెరు: హిందూ దేవాలయాలు, విగ్రహాలపై విధ్వంసానికి పాల్పడటం హేయమైన చర్యని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. జిన్నారం మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం మట్టితో చేసిన శివుని ప్రతిమ ధ్వంసం చేశారన్న ఘటన కలకలం రేపింది. బుధవారం అక్కడికి పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్ అవుటర్ రింగ్ రోడ్డు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు.. హిందూ సంస్కృతి సంప్రదాయాలు, దేవుని విగ్రహాలపై విధ్వంసం జరగడం హేయమైన చర్య అన్నారు. తాజాగా జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ముష్కర మూకలు దాడి చేసి టూరిస్టులను చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, అమీన్‌పూర్ అధ్యక్షులు ఈర్ల రాజు, రాఘవేందర్ రెడ్డి, భారతీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

15 వేల పింఛన్ ఇవ్వాలి

వికలాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు రాజేందర్

పుల్‌కల్(అందోల్): వంద శాతం అంగవైకల్యం ఉన్న వికలాంగులకు నెలకు రూ 15 వేలు చెల్లించాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ డిమాండ్ చేశారు. పుల్‌కల్‌లో వికలాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో వికలాంగులకు రిజర్వేషన్ కోటా కేటాయించాలని పేర్కొన్నారు. మేలో జరిగే మహాసభలో వికలాంగులకు సంబంధించి పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ

జహీరాబాద్ టౌన్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ యువజన కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో బుధవారం రాత్రి భారీ కాగడాల ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారి గుండా బస్టాండ్ వరకు కొనసాగింది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ చర్యకు పాల్పడిని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం రాత్రి మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో యువకులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాజీ చౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



జహిరాబాద్‌లో కాగడాల ర్యాలీలో యువజన కాంగ్రెస్ నాయకులు



న్యాల్‌కల్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు